రేవంత్‌రెడ్డిపై కేసు నమోదుచేయాలి

- బాల్క సుమన్‌పై ఎఫ్ఐఆర్ ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై అసభ్యపదజాలం ప్రయోగించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై పోలీసులు ముందుగా కేసు నమోదు చేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. లేదంటే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే, దళితబిడ్డ బాల్క సుమన్‌పై ఎఫ్ఐఆర్ నమోదుచేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించిన విధానాలనే ప్రస్తుత ప్రభుత్వం అవలంబిస్తున్నదని విమర్శించారు. ఢిల్లీ రిమోట్ కంట్రోల్ పాలన రాచరిక వ్యవస్థను తలపిస్తున్నదని మండిపడ్డారు.

'కాళేశ్వరం' ఈఎన్సీకి నోటీసు

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): మేడిగడ్డ బరాజ్ నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీకి పరస్పర విరుద్ధ ధ్రువీకరణలు ఎందుకిచ్చారో వివరణ తెలుపాలంటూ కాళేశ్వరం ఎత్తిపోతల ఈఎన్సీకి నీటి పారుదల శాఖ నోటీసు జారీ చేసింది. బ్యారేజీ నిర్మాణంలో లోపాలకు, పని పూర్తి కాకుండానే పూర్తయినట్టు నివేదించి తమను తప్పుదోవ పట్టించడానికి బాధ్యులెవరో తేల్చి.. వివరాలు పంపాలని ఈఎన్సీ (జనరల్) మురళీధర్‌కు సూచించింది.

మీటర్ రీడింగ్‌కు మేమెళ్లం!

- 'గృహజ్యోతి'కి ఆదిలోనే హంసపాదు
- మీటర్ రీడర్స్ విధుల బహిష్కరణ
- సమస్యలు పరిష్కరిస్తేనే పనిలోకి
- పనికితగ్గ వేతనాలు ఇవ్వాలని డిమాండ్
- ఉచిత కరెంటు మరింత ఆలస్యం!

నల్లగొండలో సమ్మెకు దిగి నిరసన తెలుపుతున్న విద్యుత్తు మీటర్ రీడర్స్

నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): ఉచిత విద్యుత్తు పథకానికి ఆదిలోనే హంసపాదు ఎదురైంది. మంగళవారం నుంచి వినియోగదారుల వివరాలు సేకరించాలన్న ప్రభుత్వ ఆదేశాలు అమలుకు నోచుకోలేదు. వివరాల సేకరణలో కీలకమైన విద్యుత్ మీటర్ రీడర్స్ తొలి రోజే విధులు బహిష్కరించారు. తమకు ఇస్తున్న వేతనానికి, పనికి సంబంధం లేదని, సమస్యలు పరిష్కరిస్తేనే ముందుకు వెళ్తామని తేల్చి చెప్తున్నారు. ఈ నెల 15 నాటికి వివరాల సేకరణ పూర్తికావాలన్న ప్రభుత్వ లక్ష్యానికి వీరి సహాయ నిరాకరణతో తొలి రోజే గండిపడింది. ఆరు గ్యారెంటీల్లో భాగంగా ప్రతి కుటుంబానికి నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తామని ఎన్నికల్లో ప్రకటించిన కాంగ్రెస్, హామీ అమలుపై సోమవారం ప్రకటన చేసింది. మంగళవారం నుంచి 15వ తేదీ వరకు వినియోగదారుల వివరాలు సేకరించాలని ఆదేశించింది. ఈ బాధ్యతను ప్రతినెలా మీటర్ రీడింగ్ తీసుకునే రీడర్స్‌కు అప్పగించారు. తమకు ఇచ్చే జీతానికి, పనికి సంబంధం లేదంటూ సేకరణ తమవల్ల కాదంటూ మంగళవారం విధులు బహిష్కరించారు. రీడింగ్ మిషన్లను అధికారులకు అప్పగించి రాష్ట్ర విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తూ సమ్మెలోకి వెళ్తున్నట్టు ప్రకటించారు. క్షేత్రస్థాయిలో విద్యుత్తు బిల్లుల వసూళ్లలో తమదే కీలక పాత్రని, కానీ తమకు శ్రమకు తగ్గ వేతనాలు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెలకు రూ. 5 వేలే

మీటర్ రీడర్స్ గొడ్డుచాకిరీ చేస్తున్నప్పటికీ వారికి నెలకు చేతికి అందేది రూ. 4-5 వేలే. ఒక్కో మీటర్ రీడింగ్‌కు రెండు రూపాయలు కమిషన్ ఇస్తారు. ఒక్కొక్కరు సగటున రెండువేల మీటర్ల రీడింగ్ తీయాల్సి ఉంటుంది. ఇదొక్కటే కాకుండా ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ పోల్స్ నంబర్లు అంటూ రకరకాల పనులు చేయిస్తున్నారు. ఈ నెల ఇప్పటికే మీటర్ రీడింగ్ ప్రారంభం కాగా వినియోగదారుల ఫోన్ నంబర్లు సేకరించే పని అప్పగించారు. అది కొనసాగుతుండగానే వినియోగదారుడి రేషన్‌కార్డు నంబర్, ఆధార్ నంబర్లు సేకరించాలని ఆదేశించారు. ఇవన్నీ సేకరించేందుకు ఒక్కో ఇంటి వద్ద అరగంట సమయం పట్టే అవకాశం ఉంది. దీనికితోడు యజమానులు, అద్దెకుండేవారు అంటూ మరో సమస్య కూడా ఉంది. వీటన్నింటికితోడు టార్గెట్లు. ఇంత ఒత్తిడి మధ్య పనిచేయడం తమ వల్ల కాదని, పనికి సమానంగా వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. తమ సమస్యలు నెరవేర్చే వరకు గృహజ్యోతి వివరాల సేకరణకు దూరంగా ఉండాలని నిర్ణయించారు. రాష్ట్రంలోని 2500 మంది విద్యుత్తు మీటర్ రీడర్లు విధులు బహిష్కరించి మంగళవారం సమ్మెలోకి వెళ్లారు.

వివరాలు మళ్లీ ఎందుకు?

ఆరు గ్యారెంటీల కోసం ప్రభుత్వం ఇటీవల ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. అందులో భాగంగా గృహజ్యోతి పథకానికి సంబంధించిన వివరాలను కూడా సేకరించారు. రేషన్‌కార్డు, ఆధార్ కార్డు నంబర్లతోపాటు విద్యుత్తు సర్వీసు నంబరు, ఫోన్ నంబరు వంటి అన్ని వివరాలు అందులో ఉన్నాయి. దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ కూడా పూర్తయింది. ప్రజల వివరాలన్నీ ప్రభుత్వం వద్ద ఉన్న తర్వాత కూడా మళ్లీ కొత్తగా వివరాల సేకరణ ఎందుకున్న ప్రశ్న తలెత్తింది. ప్రభుత్వ తీరు చూస్తుంటే వివరాల సేకరణ పేరుతో పథకం అమలును మరింత జాప్యం చేయబోతున్నదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పని ఒత్తిడి తీవ్రంగా ఉన్నది

నెలనెలా కరెంటు మీటర్ రీడింగ్ తీయడమే మా బాధ్యత. సంస్థకు సంబంధించిన ప్రతి పనినీ మాతోనే చేయిస్తున్నారు. ఇప్పటికే పోల్ నంబర్, ట్రాన్స్‌ఫార్మర్ నంబర్, ఫోన్ నంబర్లు సేకరిస్తున్నాం. ఇప్పుడు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు నంబర్లు కూడా సేకరించాలని అధికారులు చెప్తున్నారు. పని ఒత్తిడి తీవ్రంగా ఉంటున్నది. పనికి తగ్గ వేతనం ఇవ్వాలన్నదే మా డిమాండ్. అది నెరవేర్చే వరకు గృహజ్యోతి వివరాల సేకరణను బహిష్కరిస్తాం.

- మేడి యాదగిరి, మీటర్ రీడర్

సమస్యలు పరిష్కరించాలి

క్షేత్రస్థాయిలో విద్యుత్తు బిల్లుల వసూళ్లలో మేమే కీలకం. ఇంటింటికీ తిరిగి మీటర్ రీడింగ్‌లో తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్నాం. ఒక్క మీటర్ రీడింగ్ మాత్రమే కాకుండా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కూడా మేమే చేయాల్సి వస్తున్నది. ఒక్కో మీటర్ మీద ఇచ్చే కమీషన్ అంతా కలిపి నాలుగైదు వేలు కూడా రాదు. మేము చేసే పనికి ఇస్తున్న వేతనానికి పొంతన లేదు. మమ్మల్ని కూడా ఆర్టిజన్స్‌గా గుర్తించాలి. అప్పటివరకు మేము గృహజ్యోతి వివరాల సేకరణను నిలిపివేస్తాం.

- గుండ్లపల్లి వెంకన్న, యూనియన్ లీడర్, నల్లగొండ

లోకం పోకడ



మన సీఎంకు ఇంగ్లీషు ఎలా మాట్లాడాలో నేర్పించాలి.. తెలుగు ఎలా మాట్లాడకూడదో నేర్పించాలి!

29 వరకు సీఎమ్మార్ గడువు పొడిగింపు

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): నిరుటి వానకాలం సీజన్‌కు సంబంధించిన సీఎమ్మార్ గడువును కేంద్ర ప్రభుత్వం పొడిగించింది. ఫిబ్రవరి 29 వరకు గడువు ఇస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గడువు జనవరి 31తోనే ముగియగా, ఇంకా ఎఫ్‌సీఐకి ఇవ్వాల్సిన బియ్యం 3 లక్షల టన్నులకు పైగా పెండింగ్‌లో ఉన్నది. దీంతో గడువును పొడిగించాల్సిందిగా సివిల్ సప్లై కమిషనర్ కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు గడువును పొడిగిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్నది. ఇదే చివరి అవకాశమని, మరోసారి పొడిగించబోమని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నది.

పెద్దపల్లి జిల్లా రామగుండంలోని జ్యోతినగర్‌లతో సీఎం రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, బీఆర్ఎస్ శ్రేణులు

సిరిసిల్ల జిల్లా వేములవాడలోని తెలంగాణచౌక్‌లో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ యువజన నేతలు

రేవంత్ దిష్టిబొమ్మల దహనం

కేసీఆర్‌పై వ్యాఖ్యలను ఖండిస్తూ బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళన

వేములవాడ/జ్యోతినగర్/దేవరకద్ర/కొత్తకోట, ఫిబ్రవరి 6: ముఖ్యమంత్రి రేవంత్‌పై బీఆర్ఎస్ శ్రేణులు భగ్గుమన్నాయి. గులాబీ బాస్ కేసీఆర్‌పై రేవంత్ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం కూడా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కొనసాగాయి. ఖబడ్దార్ రేవంత్ అంటూ నినాదాలు హోరెత్తాయి. సీఎం హోదాను మరిచి గల్లీ లీడర్‌లా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక ఇలాంటి అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. పాలన చేతగానీ కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గ్యారెంటీలను అమలు చేయకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీలోని పాత సింధూర ఇంజినీరింగ్ కళాశాల రోడ్డులో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని తెలంగాణచౌక్‌లో బీఆర్ఎస్ యువజన నాయకులు రేవంత్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రలో, వనపర్తి జిల్లా కొత్తకోటలో రేవంత్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
రంగారెడ్డి	16.7°c	36.3°c
మెదక్	18.9°c	35.6°c
ఆదిలాబాద్	20.3°c	36.5°c
వరంగల్	21.0°c	31.0°c
ఖమ్మం	21.0°c	36.0°c
నల్లగొండ	21.0°c	38.0°c
హైదరాబాద్	21.6°c	35.2°c
కరీంనగర్	22.0°c	34.0°c
మహబూబ్‌నగర్	22.5°c	34.2°c
నిజామాబాద్	22.8°c	35.2°c

16న ఆటోల బంద్

- ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించాలి
- టీఏటీయూ ఆటో యూనియన్ అధ్యక్షుడు వేముల మారయ్య డిమాండ్

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): ఈ నెల 16న రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన ఆటోల బంద్‌ను విజయవంతం చేయాలని టీఏటీయూ ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య పిలుపునిచ్చారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంతో ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయి ఆత్మహత్యలు చేసుకుంటుంటే ప్రభుత్వం స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని జూపార్క్ వద్ద ఏర్పాటు చేసిన బీఆర్టీయూ ఆటో యూనియన్ స్టాండ్‌ను మంగళవారం మారయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటో, క్యాబ్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని చేపట్టే ఆటోల బంద్‌ను ప్రతి ఒక్క డ్రైవర్ విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రటరీ దయ్యాల దాసు, భవన నిర్మాణ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు చెన్నయ్య, నరసింహ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు నీరజంన్, పాషా, ఉపేందర్, మక్బూల్, ముజాత్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ జూపార్క్ వద్ద బీఆర్టీయూ ఆటో యూనియన్ స్టాండ్‌లో మాట్లాడుతున్న మారయ్య

ఇంద్రవెల్లి కాల్పుల పాపం కాంగ్రెస్‌దే

- 60 ఏండ్ల పాలనలో ఆదివాసీలను పట్టించుకోలేదు
- గిరిజనుల ఓట్ల కోసమే ఇంద్రవెల్లిలో ముఖ్యమంత్రి రేవంత్ సభ
- కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే గూడేల్లో ప్రగతి కాంతులు
- మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌లోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): నాటి ఇంద్రవెల్లి కాల్పుల పాపం ముమ్మాటికీ కాంగ్రెస్ పార్టీదేనని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి విమర్శించారు. దాదాపు 40 ఏండ్ల క్రితం అంజయ్య ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే ఇంద్రవెల్లిలో ఆదివాసీలను బలి తీసుకున్నారని ఆరోపించారు. మంగళవారం నిర్మల్‌లోని బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అప్పట్లో సంచలనం సృష్టించిన ఇంద్రవెల్లి పోలీస్ కాల్పుల ఘటనను యావత్ దేశం ముక్తకంఠంతో ఖండించిందని అన్నారు. ఈ మారణకాండలో 250 మందికిపైగా ఆదివాసీలు మరణించినట్టు చెప్పారు. గత చరిత్ర తెలియని ఇప్పటి కాంగ్రెస్ నేత, సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ఇంద్రవెల్లిలో సభ నిర్వహించి అమరులకు నివాళులు అర్పించడం హాస్యాస్పదంగా ఉన్నదని అన్నారు. 60 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ఏనాడు ఆదివాసీలను పట్టించుకున్న పాపాన పోలేదని, కేవలం గిరిజనుల ఓట్ల కోసమే ఇంద్రవెల్లిలో రేవంత్‌రెడ్డి సభ పెట్టారని విమర్శించారు. ఈ సభలో కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులను దూషించడానికే రేవంత్‌రెడ్డి అధిక ప్రాధాన్యతనిచ్చారని, సీఎం మాట్లాడిన భాషపై చిన్న పిల్లలు, మహిళలు అసహ్యించుకుంటున్నారని తెలిపారు. తమ ప్రాంతానికి సీఎం వస్తే అభివృద్ధి జరుగుతుందని, నిధులు మంజూరు చేస్తారని ఆదివాసీలు ఆశించారని, వారి ఆశలను వమ్ము చేస్తూ గిరిజనుల అభివృద్ధి కోసం సీఎం నయా పైసా మంజూరు చేయలేదని మండిపడ్డారు. ఆదివాసుల ఆరాధ్య దైవం నాగోబా ఆలయ నిర్మాణానికి కేసీఆర్ ప్రభుత్వమే రూ.ఆరు కోట్లు మంజూరు చేసిందన్నారు. తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టబోమని, ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే వరకు ప్రజలతో కలిసి పోరాడుతామని హెచ్చరించారు.

రోడ్డెక్కిన పత్తి రైతులు

- ధర నిర్ణయించకపోవడంపై ఆందోళన
- రాజీవ్ రహదారిపై రాస్తారోకో

పెద్దపల్లి టౌన్/బూర్గంపహాడ్, ఫిబ్రవరి 6: పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలని ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు వేచి చూసినా ధరలు నిర్ణయించక పోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ ఎదుట రాజీవ్ రహదారిపై గంటపాటు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. మార్కెట్‌లో విక్రయించుకునేందుకు పత్తి తీసుకువస్తే కొనుగోలుదారులు సర్వర్ డౌన్ ఉన్నదని చెప్పి ప్రతి రోజూ ఇలానే వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాస్తారోకో చేస్తున్న విషయం తెలుసుకొని ఎస్సై మల్లేశ్ అక్కడికి వెళ్లి రైతులతో మాట్లాడి శాంతింపజేశారు. అనంతరం పత్తి కొనుగోలుదారులు మద్దతు ధర నిర్ణయించడంతో కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి.

తరుగు తీయొద్దని డిమాండ్

పత్తిని కొనుగోలు చేయకపోవడాన్ని నిరసిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం లక్ష్మీపురం శివారులోని జిన్నింగ్ మిల్లు వద్ద రైతులు మంగళవారం రోడ్డుపై బైఠాయించారు. లక్ష్మీపురం తోపాటు ఇతర గ్రామాలకు చెందిన రైతులు తమ పత్తిని జిన్నింగ్ మిల్లు వద్ద విక్రయించేందుకు వెళ్లగా.. దిగుమతి చేసుకోకుండా క్వింటాకు 10 కిలోల చొప్పున తారం (తరుగు) తీస్తున్నారంటూ ఆందోళనకు దిగారు. తెచ్చిన పంటను కూడా కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. రైతులు జాతీయ రహదారిపై ఆందోళనకు దిగడంతో సుమారు కిలోమీటర్ మేర రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

'అంబేద్కర్' ట్రస్ట్‌కు 'ఘంటా' విరాళం లక్ష

అంబేద్కర్ మెమోరియల్ ట్రస్ట్‌కు ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి రూ.లక్ష భూరి విరాళం అందజేశారు. వర్సిటీ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ కే సీతారామారావు, ట్రస్ట్ ఆర్థిక కార్యదర్శి ఇంచార్జి, ప్రధానకార్యదర్శి గనుమల జ్ఞానేశ్వర్‌కు చెక్కును అందజేశారు. చక్రపాణి ట్రస్ట్ సభ్యుడే కాకుండా సలహాదారుగా ఉన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

మొండయ్య(ఫైల్)

మహదేవపూర్(కాళేశ్వరం), ఫిబ్రవరి 6: అప్పులబాధతో రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం పల్గుల గ్రామానికి చెందిన పాలిశెట్టి మొండయ్య (46) తనకున్న ఐదెకరాల భూమిలో 3 ఎకరాల్లో పత్తి, 2 ఎకరాల్లో వరి సాగు చేశాడు. ఆశించిన దిగుబడి లేకపోవడంతోపాటు క్రితం సారి పంట వేయగా వరదలు రావడంతో పంటలు దెబ్బతిన్నాయి. దీంతో సాగు కోసం చేసిన రూ.5 లక్షల అప్పు తీర్చలేక మనస్తాపంతో సోమవారం పొలం వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మొండయ్యకు భార్యతోపాటు కుమారుడు, కూతురు ఉన్నారు.

న్యాల్‌కల్‌లో భూకంపం?

న్యాల్‌కల్, ఫిబ్రవరి 6: సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలో భూకంపం అంటూ వదంతులు రావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. మంగళవారం రాత్రి 7.26 నుంచి 7.45 గంటల మధ్య మండలంలోని ముంగి, న్యాల్‌కల్, టేకూర్, మిర్జాపూర్ (ఎన్) గ్రామాల్లో భూమి కంపించిందని స్థానికులు పేర్కొన్నారు. టీవీల్లో, సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రజలు ఇండ్లల్లోంచి భయంతో బయటకు పరుగులు తీయగా, ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని సమాచారం.

డబ్ల్యూజేఐ రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా రావికంటి

- నూతన కార్యవర్గాన్ని ప్రకటించి డబ్ల్యూజేఐ

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): దేశంలోని జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజే ఐ) ఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి సమావేశాల్లో తెలంగాణ రాష్ట్ర కమిటీని నియమించింది. అధ్యక్షుడిగా రాణాప్రతాప్, ప్రధాన కార్యదర్శిగా రావికంటి శ్రీనివాస్‌ను నియమించారు. పూర్తిస్థాయి రాష్ట్ర కమిటీని ప్రకటించే బాధ్యతను శ్రీనివాస్‌కి అప్పగిస్తూ తీర్మానం చేశారు. దీంతో డబ్ల్యూజే ఐ రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా వల్లీశ్వర్, సలహాదారులుగా ఎస్‌బీ రవీంద్రరాజు వర్మ, డాక్టర్ పీ మురళీమనోహర్, నందనం కృపాకర్, ఉపాధ్యక్షులుగా ఆవునూరి సాయికృష్ణ, సతీశ్‌కుమార్, బీరప్ప, దేవిక, ఎన్ అనిల్‌రావు, వీ ఎం ప్రసాద్, కార్యదర్శులుగా చింతల క్రాంతి ముదిరాజ్, నారాయణ్ (జర్నలిస్ట్ సిద్ధు), ఆర్గనైజింగ్ సెక్రటరీగా పీ చంద్రన్న, జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా శివాజీ, కోశాధికారిగా హనుమాన్, కార్యాలయ కార్యదర్శిగా ప్రసాద్, లీగల్ సెల్ బాధ్యులుగా ఎన్ రామచంద్రరావు, ఎడ్ల రవి, టెక్నికల్ సెల్ సభ్యులుగా శ్రీకాంత్‌ను నియమించినట్టు రావికంటి శ్రీనివాస్ ప్రకటించారు. ఈ కమిటీ నియామకానికి సహకరించిన జాతీయ కమిటీకి ధన్యవాదాలు తెలియజేశారు.

పురుగుల అన్నంపై భగ్గుమన్న విద్యార్థులు

- ముల్కల్ల సాంఘిక సంక్షేమ పాఠశాలలో విద్యార్థుల ఆందోళన

విద్యార్థులకు పెట్టిన పురుగుల అన్నం

హాజీపూర్, ఫిబ్రవరి 6: పురుగుల అన్నం.. నీళ్ల చారు తినలేక పస్తులు ఉంటున్నామని గురుకుల పాఠశాల విద్యార్థులు ఆందోళనకు దిగారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం ముల్కల్లలోని సాంఘిక సంక్షేమ విద్యార్థులు మంగళవారం భోజనం చేయకుండా నిరసన చేపట్టారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లగా, విద్యార్థులు పురుగుల అన్నాన్ని చూపించారు. ఆగ్రహం వ్యక్తం చేసిన తల్లిదండ్రులు జాతీయ రహదారిపై ధర్నాకు వెళ్తుండగా, పాఠశాల సిబ్బంది గేట్లకు తాళాలు వేసి వారిని నిర్బంధించారు. ఇంతలోనే మీడియా అక్కడికి చేరుకోగా.. పేరెంట్స్, విద్యార్థులు నినాదాలు చేయడంతో గేట్లు తెరిపించారు.

ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంతోనే ఇబ్బందులు

ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంతో తమ పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. పేరెంట్స్ సమావేశానికి వచ్చే సమయంలో మాత్రమే పరిసరాలను కాస్త శుభ్రంగా ఉంచుతారని, మిగతా రోజుల్లో ఎక్కడి చెత్త అక్కడే ఉంటుందని విద్యార్థులు చెబుతున్నారు. పాఠాలు సరిగా చెప్పడం లేదని, ఆటలకు స్థలం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ మోహన్‌ను వివరణ కోరగా, స్పందించేందుకు నిరాకరించారు.

నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్ఎఫ్‌సీలో...

హైదరాబాద్‌లోని న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ (ఎన్ఎఫ్‌సీ)లో తాత్కాలిక ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 3
- పోస్టులు: నర్స్
- ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
- ఇంటర్వ్యూ తేదీలు: ఫిబ్రవరి 21, 22
- వెబ్‌సైట్: www.nfc.gov.in

ఐసీఎంఆర్‌లో...

న్యూఢిల్లీలోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 22
- పోస్టులు: ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్
- దరఖాస్తు: వెబ్‌సైట్‌లో
- చివరితేదీ: ఫిబ్రవరి 16
- వెబ్‌సైట్: https://icmr.nic.in

ఆర్మీ కాలేజీలో...

సికింద్రాబాద్‌లోని ఆర్మీ కాలేజీ ఆఫ్ డెంటల్ సైన్స్‌లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 9
- పోస్టులు: రీడర్, సీనియర్ లెక్చరర్
- విభాగాలు: అనాటమీ, జనరల్ సర్జరీ, ఫార్మకాలజీ తదితరాలు
- దరఖాస్తు: నిర్ణీత నమూనాలో
- చివరితేదీ: ఫిబ్రవరి 18
- వెబ్‌సైట్: https://www.acds.co.in

ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- సైన్స్ అండ్ టెక్నాలజీ, కరెంట్ అఫైర్స్, ఎకానమీ (గ్రూప్స్) కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.